# బహుమతి పేరాజీ



కాలేజీ సంగీతంపోటిలో ఫస్ట్ప్రయిజ్ వచ్చిన కల్పన బహూమతి కప్పు తీసుకుంటూ వుంటే- అభినందల పరంపర, ఈలలు, చప్పట్లు, గోల మిన్నుముట్టాయి. అది తీసుకుని మహదానందంగా, స్నేహితురాలు 'లత'తో యింటికి బయలుదేరింది కల్పన.

లత యిల్లు కల్పన యింటిమీదుగా వెళ్తేనే దగ్గర. అందుకే 'లత' రిక్షాలో ఎక్కించుకుంది కల్పనని

కల్పనకి ప్రయిజు వచ్చిన కప్పుని చూస్తూ, "'కప్పు' చాలా పెద్దదేనే! దీన్ని చూస్తూవుంటే- నాకు డిబేట్‌లో కూడా యింత కప్పు యివ్వకపోయారా? వెధవలు అని కడుపు మంటగావుందే-" అన్నది 'లత' నవ్వుతూ

ఆ వెండి కప్పు పెద్దదే వాళ్లో పెట్టుకుంటే బరువుగా కూడా వుంది- కల్పన నిట్టూర్చింది "నీకేం తక్కువే. అన్నీ వున్నాయ్. కావాలంటే మనం ఈ కప్పులు ఎక్స్‌ఛేంజ్ చేసుకుందామా?" అంది.

"వద్దులే- అంత మాటన్నావ్ అదే చాలు- మీ అమ్మా, నాన్నా చూసి ఎంత మురిసిపోతారో తీసుకుపో " అంది.

రిక్షాని జంక్షన్‌లో ఆపేసి దిగిపోయింది కల్పన లత "యింటిదాకా వచ్చి దింపిపోతానబ్బా!" అన్నాకూడా వద్దని వారించి "ఎంతబ్బా! నాలుగడుగులే కదా! నే వెళ్తాలే-" అంటూ వెళ్లిపోడం కల్పన కలవాటే!

నిజానికి కల్పనకి అలా చేయడం యిష్టంలేదు తన ఫ్రెండ్స్ తన యింటికి రావాలనీ- తను ఫ్రెండ్స్ యింటికి తను వెళ్లాలనీ వుంటుంది కానీ, యింటిదగ్గర పరిస్థితులు అలాంటివి కావు.

ఒక్కొక్కసారి ఆశ్చర్యపోతూ వుంటుంది– "యీ బి. ఏ. ఫైనలియర్ దాకా నేనెట్లాగ వచ్చానురా భగవంతుడా!" అని.

తండ్రి కామేశం యింట్లో వున్నాడేమో! చూడలేని దృశ్యాలేమైనా యెదురవుతాయేమోనని బెదురుతూనే గుమ్మంలో అడుగుపెట్టింది కల్పన.

మరొకరైతే, అంత పెద్ద బహుమతి వచ్చినందుకు రెక్కలు కట్టుకుని, బోలెడు ఉత్సాహంగా, యింటికి వచ్చి, అమ్మ వాళ్లోనో, నాన్న చేతుల్లోనో దాన్ని పెట్టి ముద్దులు కురిసేవారు–

కానీ, కల్పనను చూస్తూనే ఏడుస్తున్న తమ్ముడూ, చెల్లీ– పదేళ్ల రాంబాబు, ఎనిమిదేళ్ల సరళా వచ్చి ఆమె కాళ్లకు చుట్టుకున్నారు.

తండ్రి కామేశం, తల్లి శారదమ్మా ఘర్షణపడుతున్నారు. కామేశం కొంచెం చదువుకున్నవాడే. చేస్తున్న ఉద్యోగం కూడా గుమాస్తాలాంటి వుద్యోగమేగాని.. దుర్వ్యసనాల పుట్ట. సాయంకాలం అయిందా అతను అలగా జనంతో కలిసిపోతాడు. త్రాగటం, పేకాడటం– ఈ రెంటిలో ఏది లేకపోయినా, అతను నీళ్లలోంచి బయటికి తీసిపారేసిన చేప లాగ గిలగిల్లాడిపోతాడు. ఒక్కొక్కసారి కూలీనాలీ చేసుకుంటూ బ్రతికేవాళ్లపాటి సంస్కారం కూడా వుండదు.


కల్పనకిదేమీ కొత్తకాదు. రాంబాబునీ సరళనీ బుజ్జగించింది.

"చూడమ్మా! చూడు బాబూ! నాకెంత మంచి బహుమతి వచ్చిందో యిదో వెండి కప్పు దీన్ని అక్కడ బల్లమీద పెట్టండి" అంది కల్పన.

కామేశం శారదమ్మను, అంతకు క్రితమే జుట్టుపట్టుకుని, మెడలు వంచి, వీపుమీద గ్రుద్దినట్లున్నాడు– ఆమె కూలబడి, నీళ్ల నిండిన కళ్లతో భర్తని విషపు పురుగుని చూసినట్లు చూస్తున్నది!

"దీని సిగదరగ దీన్నేనాడు కట్టుకున్నానో ఆనాటి నుంచీ నాకు దరిద్రం పట్టుకుంది ఛీ! ఛీ! ముష్టి ముండా కొంప. ఎప్పుడు చూసినా– 'తేరా! తే! గాడిద కొడకా!' అంటాదే తప్ప ఒక్కనాడు యింటి కొచ్చేసరికి మనశ్శాంతి కలిగేలా అఘోరించి ఏడవదు వెధవ మూక"– కామేశం యింకా తాగి రాలేదన్నమాట! మాట తడబడటం లేదు భాష యింకా కొంచెం వినడానికి వీలుగా వుంది!

"ఛీ! ఛీ!! పెళ్ళీడు కూతురుంది. యింకా మొహానికి సిగ్గులేదు పెళ్లాన్ని కొడతారు పైగా, నేనేం వుద్యోగం చేస్తున్నానా? లేకపోతే అత్తారూ, అమ్మగారూ వదిలిపోయిన లంకెబిందెలు వున్నాయా? నన్ను పీక్కుతినకపోతే వెధవ త్రాగుడూ, జూదం మానేయరాదూ–" శారదమ్మ గొంతు కూడా చిన్నదేమీ కాదు.



"అబ్బ! మహా పతివ్రత చెప్పింది కదాని మానేస్తారే! పగలంతా నీకోసం, నీ సంతానంకోసం చాకిరీ చేసేది చాలక సాయంకాలం అలా క్లబ్‌కి పోయొస్తే... నీ అబ్బముల్లె పోయినట్లు గోలెడతావ్. పైగా గుణ్ణమంతైంది ఆడపిల్ల యిదే మొగాడైతే యీపాటికి చేతికందేవాడు–దాన్నేమో కాలేజీకి తోల్తావ్–ఏం! ఎందుకు? ఏదైనా దుకాణంలో "సేల్స్ గర్ల్"గా పారేస్తే అదో వంద తెచ్చిపోసేదిగా నీ చేతిలో–"

"నాన్నా! యిక మీరు దయచేసి కొట్టుకోకండి. నేను పరీక్షలు రాయడానికి యింక నెల్లాళ్ళు పైముంది అంతే. ఆ తర్వాత, నా పొట్టతిప్పలు నేనే పడతానులే ప్లీజ్! నువ్వు అమ్మని చావచంపక బయటికి పో ఆవిడ కసలే గుండెదడ కూడా వుంది–" కల్పన కోపంగా కసిరింది.

"ఆహా! హా! గుండె నొప్పిట! అయితే ఓ అయిదు రూపాయ లిలా

చేసుకొస్తాను ”

“ఛీ! ఛీ! కన్న కూతురితోనా మీరిట్లా ” అంటూ శారదమ్మ అడ్డు రాగా, కామేశం 'ఛూ' అంటూ చీదరించుకున్నాడు.

“ఆఫ్టరాల్ ఫైవ్ రుపీస్‌కి మొహం వాచాడీ కామేశం. లాభంలేదు. నాకు క్లబ్‌లో పరువుదక్క దివాళ సరే ఏదోఒకటిలా పారేయ్”అంటూ అరిచాడు.

అంతలో కల్పనకి బహుమతి వచ్చిన కప్పు చూశాడు. వెంటనే మెత్తబడి పోయాడు.

“అమ్మా! కల్పా! ఏంటే యిది? వెండిపూత కాబోలు! ఔనా! మనదేనా? ఎవరేనా ఎరువిచ్చారా?” అన్నాడు వెండి కప్పుని చేతుల్లోకి తీసుకుని

కల్పనకి గ్రుడ్లలోకి నీళ్ళు చిప్పిలి వచ్చాయి. కాని లోపల లోపలే దుఃఖం అదుపుకుని— “అది నా కివాళ కాలేజీలో యిచ్చిన బహుమతి అమ్మా!” అంది తల్లివేపు తిరిగి.

“నామ్మే! నా తల్లే! నా అందాల బొమ్మే!” అంటూ శారదమ్మ లేచి, బిడ్డ దగ్గరిసా వచ్చి తల నిమిరింది.

కామేశం ఎంతో ప్రసన్నుడైనాడు

“భలే బాగుందమ్మా! వస్తా యిప్పుడే దీన్ని మా ఫ్రెండ్స్‌కి చూపెట్టి” బయటికి వెళ్ళిపోయాడు.


కల్పన వారించే ప్రయత్నం కూడా చేయలేనంత త్వరగా— ఆ అమ్మాయికి వేలాది హర్షధ్వానాల మధ్య లభించిన 'అమూల్య' కానుకను 'మూల్యం'గా మార్చటానికి— జూదంలో పణంగా పెట్టడానికి— పట్టుకుపోయాడు కన్న తండ్రి!

“ప్చ్! పోనీ కర్మ అది తాకట్టుపెట్టి తాగేస్తాడు యీపూట నాన్న! పోన్లే, అలాగైనా తండ్రికి యీ బిడ్డ కాస్తంత ఆనందం యివ్వగలిగా ననుకుంటుంది ” అంటూ దుఃఖం పట్టలేక తల్లివళ్ళో తలదూర్చి బావురుమని ఏడ్చేసింది కల్పన.

శారదమ్మ ఏమంటుంది?

“అంతా మన కర్మ తల్లీ! యీ పాడుబుద్ధులు రోజు రోజుకీ ఎక్కువై పోతున్నాయి యీయనకి. మన సరళ పుట్టక మునుపు ఆఖరికి సిగరెట్ కూడా ముట్టి ఎరుగరమ్మా” అంటూ భర్త అవలక్షణాలను కూతురుదగ్గరే దాయాలని యత్నంచేసింది.

“తెస్తారులే తల్లీ! కప్పు ఆయనేం చేసుకుంటారు? నా బంగారు తల్లికివాళ ఎంత దిష్టి తగిలిందో లే వోసారి ఉప్పు దిగదుడిచి పారేస్తా”నంది శారదమ్మ.




కల్పన వెలితిగా నవ్వింది.

"ఎందుకమ్మా వుండనీ ఆ వుప్పు కూడా దండగెందుకు! పిల్లలకి మజ్జిగలో వేసి యిద్దువుగాని నాలాంటి మొద్దుకి- రాగ, విరాగాలే వుండవు యింక దిష్టి కూడానా?" అంది.

అమూల్యమైన ఒకతురి బహుమతిని 'మూల్యం'గా మార్చుకునే తండ్రి కామేశం ఫోటో అతని చిన్ననాటి దొకటి గోడను వ్రేలాడుతూవుంటే చూసికల్పన- నోటి చివరదాకా వచ్చిన తిట్లన్నీ ఆపుకుని, బరువుగా నిట్టూర్చి- "నాకు దేవుడిచ్చిన కమ్మని కంఠం అనే బహుమతిని మాత్రం లాక్కోకు-వులే నాన్నా!" అనుకున్నది భారంగా!

— — —